అర్హులకు యూరియా పంపిణీ చెయ్యాలి

● వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి


గాదె మధుసూధనరెడ్డి (ఫైల్)

కారంచేడు: వ్యవసాయం చేస్తున్న అన్నదాతలందరికీ అవసరమైన ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కారంచేడు ప్రాంతంలోని రైతులు ఎరువుల (యూరియా) కోసం ఎండల్లో పడిగాపులు పడుతూ గంటలకొద్దీ బారులు తీరడం బాధగా ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంతంలో ఎరువుల కోసం రైతులు రోడ్డు ఎక్కే దుస్థితి నేటి కూటమి ప్రభుత్వ పాలనలో చూడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్చూరు నియోజకవర్గంలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి ఉంటారన్నారు. ముఖ్యంగా కారంచేడు మండలంలో సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగు అవుతోందని, ఈ సాగుకు రైతుల నుంచి ఒక్కో ఎకరానికి కనీసం మూడు బస్తాల యూరియా అవసరమని చెప్పారు. సగటున కారంచేడు ప్రాంతంలో సుమారు 75 వేల బస్తాల యూరియా అవసరం అవుతుందన్నారు. కారంచేడు ప్రాంతంలో ప్రస్తుతం ఎదల దశలో ఉన్న వరి చేలల్లో కలుపులు తీసి యూరియా పిచికారీ చేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇక్కడి రైతులకు కేవలం రెండు బస్తాల యూరియా చొప్పున మాత్రమే పంపిణీ చేస్తున్నారన్నారు. చాలీచాలని ఎరువులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఎకరానికి మూడు బస్తాల చొప్పున యూరియాను ఆయా రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు పక్షాన రోడ్డు ఎక్కాల్సి ఉంటుందని మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు.

నూతన సమన్వయకర్తకు హనిమిరెడ్డి మద్దతు

అద్దంకి: ఇప్పటి వరకూ అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా పనిచేసిన పానెం చిన హనిమిరెడ్డి నూతన సమన్వయక్తగా నియమితులైన డాక్టర్ అశోక్‌కుమార్‌కు తన మద్దతు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సమన్వయకర్తగా తనను ఆదరించిన విధంగానే నూతన సమన్వయకర్తను అందరూ ఆదరించాలని కోరారు. అందరి లక్ష్యం ఒకటేనని, 2029 ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమేనని చెప్పారు. అదే విధంగా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు.

అర్జీలను సత్వరం విచారించాలి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, స్పందన అర్జీలపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలు త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా అనధికార లేఔట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటు నీటి తీరువా వసూలు చేయాలన్నారు. ఓటీసీలపై పలు సూచనలు అందించారు. రెవెన్యూ ఉద్యోగులు విధులు సమర్థంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు ఉన్నారు.

దాతల సాయం మరువలేనిది


పాఠశాలకు ఫర్నిచర్ అందిస్తున్న దాతలు

యద్దనపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని ఎంఈఓ సీహెచ్ గోపి అన్నారు. మండలంలోని గన్నవరం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు ఎడైన్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లేళ్లపల్లి సుధీరా వెంకటేశ్వర్లు, లేళ్లపల్లి సుబ్బారావులు పాఠశాలకు రూ.10 వేల విలువైన ఎస్.కుర్చీలు, టేబుల్స్, పాఠశాలకు అందజేశారు. దాతలను పాఠశాల సిబ్బంది అభినందించారు. పోపూరి సునీల్ కుమార్, షేక్ రెహమాన్ పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం


అదృశ్యమైన యువకుడు జగదీష్ చంద్ర

వేటపాలెం: స్థానిక సంతరావూరు రోడ్డు జక్షన్ వద్ద నివాసం ఉంటున్న యువకుడు మాలేంపాటి జగదీష్ చంద్ర అదృశ్యమయ్యాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై జనార్దన్ సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి డిప్లమో చదువుతున్న యువకుడు బయటి వెళ్లినట్లు చెప్పారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు తన కుమారుడి స్నేహితుల వద్ద వాకబు చేశారు. గ్రామం, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కుమారుడు కనిపించక పోవడంతో తన కుమారుడు కనిపించడం లేదని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు 91211 02146, 91211 02143 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉపాధి పనుల్లో అవినీతి సహించేది లేదు

● డ్వామా పీడీ విజయలక్ష్మి


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

కారంచేడు: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని బాపట్ల డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) విజయలక్ష్మి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రం కారంచేడు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజావేదికలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో సుమారు 590 పనులకు సంబంధించి సుమారు రూ.9 కోట్ల నిధులు వెచ్చించామన్నారు. వేజ్‌కు సంబంధించి రూ.6.60 కోట్లు, మెటీరియల్‌కు సంబంధించి రూ.2.25 కోట్లు వినియోగించినట్లు ఆడిట్ నివేదికల్లో ఉందన్నారు. వీటిని ఈ నెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఆటిట్ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి నివేధికలు సిద్ధం చేశారన్నారు. వీటిలో ప్రాథమికంగా గ్రామంలో మస్టర్ వ్యవహారంలో తేడాలున్నట్లు గుర్తించారన్నారు. పంట కాలువలు కొన్ని గ్రామాల్లో కొలతల ప్రకారం లేవన్నారు. కార్యక్రమంలో ఏపీడీ బి.శింగయ్య, డీవీఓ చంద్రశేఖర్, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్, ఎంపీడీఓ రాంమ్మోహన్‌రావు, పీఆర్ ఏఈ రామచంద్రుడు, డి.దాసు, ఏపీఓలు జె.లక్ష్మీదేవి, బల్లియ్య, ఎస్ఆర్పీ నాగరాజు, డీఆర్‌పీలు, ఉపాది సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వంలో అన్యాయం


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

చినగంజాం: ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వంలో అన్యాయం జరుగుతోందని బాపట్ల జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు అన్నారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా, మండల స్థాయి ఉపాధ్యాయులు పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శేఖర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, నాలుగు డీఏలు పెండింగ్‌లు ఉన్నాయని చెప్పారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ ఇవ్వలేదని, పీఆర్సీ కమిషన్ ఇంతవరకు వేయలేదన్నారు. చినగంజాం మండలం ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగని శ్రీనివాసరెడ్డి, బి. నాగరాజు, జిల్లా కార్యదర్శులు కె.మెరియన్‌బాబు, ఎం.రవికుమార్, జి.శేషయ్య, కె.భాస్కర్, ఎం.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల నాయకుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తాహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. 12వ పీఆర్‌సీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలఅన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ కంకణాల శ్రీనివాసరావు, మాడుగుల కిషోర్‌బాబు, జి.ఎలీశా, కరి రామయ్య, రమేష్‌బాబు, మల్లికార్జునరావు, చెంచురామారావు పాల్గొన్నారు.

వడ్డెర సంఘ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా పల్లపు


నియామక పత్రం అందుకుంటున్న ఇమ్మానుయేల్


చీరాల రూరల్: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా చీరాల జాన్‌పేటకు చెందిన పల్లపు ఇమ్మానుయేల్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం గుంటూరులో రాష్ట్ర వడ్డెర సంఘ అధ్యక్షుడు పల్లపు మహేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు ఇమ్మానుయేల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి తనపై పెద్ద బాధ్యత పెట్టిన పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర జాతి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. వడ్డెరలను ఎస్టీల జాబితాలో చేర్చమని ఎప్పటి నుంచో ప్రభుత్వాలను వేడుకుంటున్నా పాలకులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, త్వరలోనే ఉద్యమ కార్యాచరణ రూపొందించి వడ్డెరలను ఐక్యం చేసి రాజ్యాధికారం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

క్రీడలతో ఉత్సాహం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో

బల్లికురవ: క్రీడలతో శారీరక, మానసిక వికాసంతో పాటు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తాయని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ అండ్ 14, 17 వాలీబాల్ కబడ్డీ, హైజంప్, లాంగ్ జంప్ పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విజేతలైన టీమ్‌లను చీరాలలో జరిగే డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. ఎంఈవో-2 రమేష్‌బాబు, పెదఅంబడిపూడి ఉన్నత పాఠశాల పీడీ అరుణ, పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన బంతుల తయారీపై శిక్షణ


విత్తన బంతులు తయారు చేస్తున్న విద్యార్థులు

జె.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హైస్కూల్లోని విద్యార్థులకు విత్తన బంతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. విత్తన బంతుల ద్వారా చెట్లను సులభంగా పెంచవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు అధ్యక్షుడు డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. ఎర్ర మట్టిలో కంపోస్టు ఎరువులు కలిపి వాటిని బంతులు మాదిరి తయారు చేసి అందులో విత్తనం వేసి రోడ్ల వెంట, చెట్లు లేని ప్రాంతాల్లో వేస్తే అవి సులభంగా పెరుగుతాయని చెప్పారు. గానుగ, తురాయి, వేప, నేరేడు, అఫిషియా తదితర చెట్లకు చెందిన విత్తనాలను బంతుల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లలో మొక్కలు పెంచితే పర్యావరణానికి నష్టమని, విత్తన బంతులతో పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. రోటరీ క్లబ్ పంగులూరు ట్రెజరర్ ఖాలేషావలి, రిటైర్డ్ లెక్చరర్ రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సభ్యులు డి.లక్ష్మీనారాయణ, పంగులూరు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం రావి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మేరీ శ్యామల, శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

దసరా సెలవులు పొడిగించాలి

● వైఎస్సార్ టీఏ జిల్లా అధ్యక్షుడు బొజ్జా సురేష్


బొజ్జా సురేష్ (ఫైల్)

చీరాల అర్బన్: ఉపాధ్యాయులు, విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 3వ తేదీ వరకు దసరా సెలవులు పొడిగించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బొజ్జా సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం దసరా సెలవులు ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రకటించారన్నారు. సెలవులకు సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు పండగ రోజే తిరిగి రావడానికి ఇబ్బందులు పడతారని, సెలవులను 3వ తేదీ వరకు పొడిగించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు విధులు సమర్థంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఈవోఆర్డీ రామకృష్ణ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలు సత్వరంగా అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలని చెప్పారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీల కార్యదర్శులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూత


మాట్లాడుతున్న ఎంఈవో కేవీ శ్రీసివాసరావు

అద్దంకి: ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా చేయూతనిస్తోందని మండల విద్యాశాఖాధికారి-2 కేవీ శ్రీనివాసరావు అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (సత్రంబడి)ను సందర్శించారు. దానిలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులను తరగతుల వారీగా వారి సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి వారి అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి, భవిత కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు కేంద్రంలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రోజు వారీ మెనూ పరిశీలించారు. ఆ తర్వాత ఉపాధ్యాయులతో సమావేశమై తగు సూచనలు, సలహాలు అందించారు. ఇటీవల ముఖ్యమంత్రి తుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సత్రంబడి పాఠశాల ఉపాధ్యాయిని ధనలక్ష్మిని కేవీ శ్రీనివాసరావును ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు గర్నెపూడి శ్యామ్‌కుమార్, ఎం. ధనలక్ష్మి, జె.బాబూరావు, కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

200 మందికి పింఛన్ల పంపిణీ

చీరాల అర్బన్: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) ఆధ్వర్యంలో సోమవారం వికలాంగులు, వృద్ధులకు పింఛన్లు, బియ్యం పంపిణీ చేశారు. స్థానిక ఆవోపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వికలాంగులు, వృద్ధులు మొత్తం 200 మందికి పింఛన్లు, బియ్యం పంపిణీ చేసి భోజనం అందించారు. ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ఎంతో మందికి ఉపయోగపడ్డాయని ముఖ్యఅతిథిగా హాజరైన సీహెచ్ చెన్నకేశవులు కొనియాడారు. దాతల సహకారంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆవోపాను అభినందించారు. ప్రాజెక్టు చైర్మన్ మారుటూరి రాఘవేంద్రరావు, అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, కార్యదర్శి పోలిశెట్టి శ్యామసుందరరావు, కోశాధికారి పేర్ల వెంకట రామయ్య, మహిళా విభాగం అధ్యక్షుడు గెల్లి సతీ సుకన్య, గురుప్రసాద్, భాగ్యలక్ష్మి, సత్యనారాయణ, పి.రామారావు, కుమారస్వామి, కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేటపాలేనికి తహసీల్దార్‌ను నియమించాలి


వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల అర్బన్: వేటపాలెం మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని వైఎస్సార్ సీపీ ఆ మండల అధ్యక్షుడు సాధు రాఘవ, పార్టీ నాయకులు సోమవారం చీరాల ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా మండలంలో తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునేందుకు ఆలస్యమవుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు అందుకునేందుకు విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఎంతో అవసరమని, రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రమేష్, వేటపాలెం మండల మాజీ అధ్యక్షుడు బి.సుబ్బారావు, పార్టీ నాయకులు చెల్లి బాబూరావు, చక్రవర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్ దంపతులు

అద్దంకి: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ అశోక్‌కుమార్ సోమవారం పిడుగురాళ్ల మండలం గత్తికొండ బిలంలో సతీ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. నూతన సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ అశోక కుమార్‌ను నియోజకవర్గంలోని వివిధ మండలాలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

వేటపాలెం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి మరమ్మతులు చేస్తున్న సమయంలో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం పందిళ్లపల్లిలో జరిగింది. వివరాలు.. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురి కావడంతో పైకి ఎక్కి బాగు చేసే సమయంలో 11కేవీ విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడి నుంచి కింద పడిపోయాడు. వెంటనే కిందనే ఉన్న మరికొంత మంది ఎలక్ట్రిషియన్స్ కలిసి గాయపడిన అతడిని చికిత్స కోసం చీరాల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. చేతికి తీవ్ర గాయాలయ్యాయి.